క్లుప్తంగా

ఫిరంగిపురం తహసీల్దార్‌గా నాంచారయ్య



ఫిరంగిపురం: ఫిరంగిపురం మండల తహసీల్దార్‌గా జి.నాంచారయ్య బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఈసందర్భంగా కార్యాలయం డీటీ రాజారమేష్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఘనంగా జాషువా కళాపరిషత్ వార్షికోత్సవం

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాలలోని గుర్రంజాషువా స్మారక కళాపరిషత్ 36వ వార్షికోత్సవాన్ని బుధవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో నిర్వహించారు. తొలుత గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పెద్దేటి యోహాన్ మాట్లాడుతూ సంస్థ విశేష సేవలందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం షేక్ సుభానికి 2024 సేవారత్న పురస్కారం అందించి సత్కరించారు.

ఈమనిలో డీపీఓ పర్యటన



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జిల్లా పరిషత్ పాఠశాలను దుగ్గిరాల మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారి కె.శ్రీదేవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలోని రికార్డులను, అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో తాగునీటి శాంపిల్స్‌ను ఈమని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ ద్వారా పరీక్షించారు. ఎంఈఓ కె.శ్రీనివాసరావు, దుగ్గిరాల మండల పంచాయతీ విస్తరణ అధికారి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉన్నత ఆలోచనలతో విద్యాభివృద్ధి

జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ



ఫిరంగిపురం: విద్యార్థులు ఉన్నత ఆలోచనలు కలిగి ఉన్నప్పుడే విద్యాభివృద్ధిని సాధించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ అన్నారు. మండలంలోని మునగపాడు, పొనుగుపాడు, అల్లంవారిపాలెం గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలను బుధవారం ఆమె పరిశీలించారు. మునగపాడులోని ప్లస్ టూ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. వారిని ప్రశ్నించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు వినియోగించుకొని ఉన్నత శిఖరాలను అందుకోవాలని తెలిపారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందినవీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. పొనుగుపాడు పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అల్లంవారిపాలెం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తగిన సూచనలు ఉపాధ్యాయులకు అందజేశారు. ఆమె వెంట ఎంఈఓలు షేక్ మహబూబ్‌సుబాని, రవికాంత్ ఉన్నారు.

డిపో మేనేజర్ మంత్రునాయక్‌కు సన్మానం



మంగళగిరి: ఆర్టీసీ డిపో అభివృద్ధికి డీఎం మంత్రు నాయక్ చేసిన కృషి అభినందనీయమని పలువురు ఉద్యోగులు కొనియాడారు. డీఎం నాయక్ బదిలీ సందర్భంగా బుధవారం ఉద్యోగులు, సిబ్బంది డీఎంను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ అందరితో సమన్వయంగా ఉంటూ మంగళగిరి డిపోను ఆదర్శంగా నిలిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏ శ్రీనివాసరావు, శర్మ, సాంబశివరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మేడికొండూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ నాగరాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

- బస్టాండ్ లోపలికి వెళ్లని బస్సులు
- రోడ్డుపైనే వేచి ఉంటున్న ప్రయాణికులు
- మరుగుదొడ్లకు తాళాలు



రోడ్డుపైనే ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆర్టీసీ బస్సు

ఫిరంగిపురం: మండల కేంద్రంలో రెండుదశాబ్దాల కిందట ప్రయాణికుల కోసం నిర్మించిన ఆర్టీసీ బస్టాండు నిరుపయోగంగా మారింది. గుంటూరు–కర్నూలు రహదారి కావడంతో అనునిత్యం ఫిరంగిపురం మీదుగా అనేక సంఖ్యలో బస్సులు వెళ్తుంటాయి. కానీ ఒక్క బస్సు కూడా బస్టాండు లోపలికి వెళ్లి ఆగి ప్రయాణికులను ఎక్కించుకోవడం కనిపించదు. రోడ్డుమీదనే ఆగి ప్రయాణికులను ఎక్కించుకుంటారు.

గంటల తరబడి నిలిచి..

బస్సుకోసం ప్రయాణికులు రోడ్డుపక్కగా నిలబడి వేచి ఉండాల్సి వస్తుంది. ఎండలు మండుతున్నా, వర్షాలు పడుతున్నా కూడా వేచి బస్సు ఎక్కాల్సి వచ్చేది. గ్రామం నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు, పనులు కోసం కార్మికులు ఉదయాన్నే బస్సుల కోసం వేచి ఉంటారు. కొన్ని సమయాల్లో ప్రయాణికులు ఎక్కువగా ఉండి ఒత్తిడికి లోనవుతున్నారు. కొన్ని సమయాల్లో బస్సులు ఆగకుండా ముందుకు వెళ్తుండటంతో రోడ్డుమీదనే ప్రయాణికులు పరుగులు పెట్టాల్సి వస్తుందని, దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

ఇంజినీరింగ్ లోపం..

ఎన్నో ఏళ్ల కిందట బస్టాండు నిర్మాణం జరిగినా ఇంజినీరింగ్ లోపం కారణంగా బస్సులు తిరిగేందుకు ఇబ్బందిగా మారిందనే సాకుగా ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. కానీ దానిని మరలా కొద్దిపాటి మరమ్మతులు చేసి వినియోగంలోకి మాత్రం తీసుకురావడం లేదు. రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతుందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అందుకు నిదర్శనంగా అక్కడక్కడా మందుబాబులు తాగి పడేసిన మందు బాటిళ్లు కనపడుతున్నాయి. బస్టాండులోపలికి వెళ్లి కూర్చోవాలంటేనే భయపడే పరిస్థితి నెలకొందని ప్రయాణికులు చెబుతున్నారు.



బస్సుకోసం వేచిఉన్న ప్రయాణికులు



బస్టాండ్‌లో మరుగుదొడ్లకు తాళాలు వేసిన దృశ్యం

బాతురూంలకు తాళాలు..

ప్రయాణికులు కాలకృత్యాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బాతురూంల గదులకు తాళాలు వేసి ఉన్నాయి. దీంతో ప్రయాణికులు అక్కడ ఉన్న బహిరంగ ప్రదేశాన్ని వినియోగించుకుంటున్నారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా ఆశాఖ అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

‘ఫిన్‌టెక్’ రాకతో అన్ని రంగాల్లో పెనుమార్పులు

ఫిన్‌టెక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బోర్డు సభ్యులు డాక్టర్ శ్రీనివాసన్



విద్యార్థినికి ఫిన్‌టెక్ సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: ఫిన్‌టెక్ టెక్నాలజీ రాకతో పెనుమార్పులు వచ్చినట్లు ఫిన్‌టెక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) బోర్డు సభ్యుడు డాక్టర్ శ్రీనివాసన్ తెలిపారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన ఫిన్‌టెక్ ఇన్నోవేషన్ లేబొరేటరీ ప్రారంభోత్సవానికి డాక్టర్ శ్రీనివాసన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక రంగానికే కాకుండా వినియోగదారుల నుంచి, ఆర్థిక సంస్థలతో పాటు కొత్తగా వ్యాపార రంగంలోకి ప్రవేశించే వారి నుంచి రెగ్యులేటర్ల వరకు కొత్త ఉద్యోగ అవకాశాలను, ప్రాజెక్టులను సృష్టిస్తోందని పేర్కొన్నారు. టెక్నాలజీతో ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. పోటాపోటీగా ఆర్థిక సేవలను ప్రజలకు సులువుగా అందించడంతో పాటు ప్రాముఖ్యతను విస్తృతం చేయడం ద్వారా, బీటెక్ పట్టభద్రులకు కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని అన్నారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతున్న సందర్భాన్ని గుర్తించి తమ వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులతో పాటు ఎంబీఏ విద్యార్థులకు ఫిన్‌టెక్‌ను మెర్జ్ చేసి సులభతరంగా వారికి పాఠ్యాంశాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఏడాదికి 500 మందికి పైగా తమ వర్సిటీకి చెందిన విద్యార్థులు ఫిన్‌టెక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అందించే వివిధ ఫిన్‌టెక్ కోర్సులలో ఇంటర్న్‌షిప్‌తో పాటు ఫిన్‌టెక్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రపంచ ఫిన్‌టెక్ కౌన్సిల్ యొక్క అత్యంత విశ్వసనీయమైన ప్రొఫెషనల్ సర్టిఫికెట్, బ్యాడ్జ్ పొందారని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రొ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, స్కిల్ డెవలప్‌మెంట్, స్టూడెంట్ ప్రొగ్రెషన్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ ఎస్.బి.వి.ప్రసాద్, కె.ఎల్.టిఫ్. సీఈఓ హరిబాబు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో మెరుగైన ర్యాంక్ సాధించడమే లక్ష్యం

నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్– 2024లో గుంటూరు నగరపాలక సంస్థకు మెరుగైన ర్యాంక్ సాధించడానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటామని ఎంహెచ్‌ఓ(ఎఫ్ఏసీ) మధుసూదన్‌రావు తెలిపారు. నగర కమిషనర్ (ఎఫ్ఏసీ) ఎస్.హరికృష్ణ ఆదేశాల మేరకు స్వచ్ఛ సర్వేక్షణ్– 2024లో తీసుకోవాల్సిన చర్యలపై నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య అధికారులు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఓ మాట్లాడుతూ నగరంలో మెరుగైన పారిశుద్ధ్యాన్ని సాధించడానికి వంద రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని, అందుకు తగిన విధంగా వార్డు సచివాలయాల వారీగా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గత ఏడాది కంటే మెరుగైన ర్యాంక్ సాధించడం తేలికవుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, ప్రతి కమర్షియల్ సంస్థ డస్ట్ బిన్‌ని ఏర్పాటు చేసుకునేలా కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యాంటీ మలేరియా చర్యలు చేపట్టడం, ఖాళీ స్థల యజమానులే తమ స్థలాలను శుభ్రం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో శానిటరీ సూపర్‌వైజర్లు రాంబాబు, ఆనంద కుమార్, ఆయూబ్ ఖాన్, సోమ శేఖర్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమావేశాలను జయప్రదం చేయండి

లక్ష్మీపురం: ప్రభుత్వాలు మారుతున్న కార్మికులు, రైతుల సమస్యలు తీరడం లేదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు.

సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ప్రజలపై భారాలు మోపుతూ బడా కార్పొరేట్ సంస్థలకు రాయితీలను ప్రకటించిందని విమర్శించారు. ఇది ప్రజల ప్రభుత్వం కాదని దుయ్యబట్టారు. గుజరాత్ వ్యాపారస్తుల ప్రభుత్వమన్నారు. కార్మికులకు శాపంగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ సమితి సమావేశాలు సెప్టెంబర్ 1,2,3 తేదీలలో విశాఖపట్నంలో పెద్ద ఎత్తున జరుగుతున్నాయని 3వ తేదీ వేలాది మంది కార్మికులతో మహాప్రదర్శన, బహిరంగ సభ జరగబోతున్నదని గుంటూరు జిల్లా కార్మిక వర్గం ఈ ర్యాలీ, బహిరంగ సభలలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మహా ప్రదర్శన పోస్టర్లు ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా కోశాధికారి పుప్పాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రావుల అంజిబాబు, మంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించండి



జేసీ భార్గవ్ తేజకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

గుంటూరు వెస్ట్: జిల్లాలోని రేషన్ డీలర్ల కనీస సమస్యలను పరిష్కరించాలని చౌకదుకాణాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వైఏబీ ప్రసాదరావు జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజకు వినతిపత్రం అందజేశారు. బుధవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జేసీని అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఐసీడీఎస్, ఎండీఎం బకాయిలు ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని వెంటనే విడుదల చేయాలన్నారు. రెండు నెలల నుంచి బియ్యంపై రావాల్సిన కమీషన్లు ఎస్‌సీఎం ఖాతాలో జమచేస్తున్నారని, దీనివల్ల డీలర్లు ఆర్థిక పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కమీషన్‌ను డీలర్ల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని కోరారు. అసోసియేషన్ నాయకులు దాసరి శ్రీనివాసరావు, వంగపాటి అంజయ్య, కె.విద్యాసాగర్, పి.సాయి హనుమంతరావు, కిషోర్ పాల్గొన్నారు.

ప్రకాష్ నగర్‌లో డ్రెయిన్ పూడిక తీత



తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పలుచోట్ల కార్పొరేషన్ ఆధ్వర్యంలో పూడికతీత పనులు చేపట్టారు. వర్షాకాలంలో మురుగునీటి సమస్యను పరిష్కరించి దోమలు నివారించేందుకు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని కార్పొరేషన్ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని మంగళగిరి పట్టణ, రూరల్, తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో జెసిబీల ద్వారా ముందుగా ఔట్ ఫాల్ డ్రైన్ పనులు చేపట్టారు. ప్రకాష్ నగర్‌లోని రైల్వే స్థలంలో, సీతానగరం, ప్రాతూరు, వడ్డేశ్వరం, కొలనుకొండ, చిర్రావూరు ప్రాంతాల్లో ఈ పూడికతీత పనులు చేపట్టారు.

అనారోగ్యంలో వివాహిత ఆత్మహత్య

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని పెదవడ్లపూడిలో వివాహిత ఆత్మహత్య ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పచ్చిపులుసు వెంకటమణి(40) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. బుధవారం వెంకటమణి భర్త మల్లికార్జునరావు యథావిధిగా వ్యాపార నిమిత్తం బయటకు వెళ్లగా మణి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. మణి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఊపిరి తీసే రాచపుండు

- పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు
- ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించాలి
- పొగతాగని వారికి సైతం సోకే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన
- నేడు వరల్డ్ లంగ్ క్యాన్సర్ డే



గుంటూరు మెడికల్: మనిషి ఊపిరి తీసుకునేందుకు తద్వారా అతడు జీవించి ఉండేందుకు ఉపయోగపడే ఊపిరిత్తుల క్యాన్సర్ కేసులు అధికమవుతుండడంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తుంది. ఆధునిక జీవనశైలి వల్ల వాహనాల వినియోగం పెరిగిపోవడం, పచ్చదనం తగ్గిపోవడం, పారిశ్రామికీకరణ పెరిగిపోవడంతో ఊపిరితిత్తుల క్యాన్సర్లు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఊపిరి తిత్తుల క్యాన్సర్‌ను వైద్య నిపుణులు సైలెంట్ కిల్లర్‌గా పేర్కొంటున్నారు. ఊపిరితిత్తులకు క్యాన్సర్ సోకడం ద్వారా త్వరితగతిన మరణాలు సంభవిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం క్యాన్సర్ మరణాల్లో మూడొంతులు ఊపిరితిత్తులకు సంబంధించి మరణాలేనని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రజలు వ్యాధి బారిన పడకుండా ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 1న వరల్డ్ లంగ్ క్యాన్సర్ డే నిర్వహిస్తున్నారు.

వ్యాధి కారణాలు...

ధూమపానం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రధాన కారణం. సిగిరెట్లు, హుక్కా, గంజాయి పీల్చటం లంగ్ క్యాన్సర్‌కు దారితీస్తుంది. ఊపిరి తిత్తుల క్యాన్సర్ సోకిన వారిలో నూటికి 90శాతం మంది పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్ బారిన పడ్డారు. సాధారణ వ్యక్తితో పోల్చితే పొగతాగేవారిలో క్యాన్సర్ రావటానికి 2.5శాతం రెట్లు ఎక్కువ అవకాశం ఉంది. కాలుష్య పొగల కారణంగా, వాహనాల కాలుష్యం వల్ల, రేడియేషన్ వల్ల, వాతావరణ కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నాయి.

జిల్లాలో బాధితులు...

జిల్లాలో 30 మంది పల్మనాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు వారంలో ఇద్దరు లేదా ముగ్గురు బాధితులు ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడి చికిత్స కోసం వస్తున్నారు.

వీరికి ఎక్కువగా ఊపిరితిత్తుల క్యాన్సర్...

పొగతాగేవారి కంటే వారి పక్కన ఉండే వారే ఎక్కువగా లంగ్ క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారు. మహిళలు, పిల్లలూ బాధితులే. ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసులకు, టోల్‌గేట్ వద్ద పనిచేసే సిబ్బందికి, క్వారీలు, మైనింగ్, తారు రోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణాల పనుల్లో పాల్గొనే వారికి ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నట్లు వైద్య నివేదికలు తెలియజేస్తున్నాయి. ధూమపానం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్లే కాకుండా శరీరంలోని ఇతర అవయవాలకు సైతం క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ధూమపానం చేసేవారితోపాటు వారి పక్కన ఉండే కుటుంబ సభ్యులు ఎక్కువశాతం క్యాన్సర్‌బారిన పడుతున్నారు. పొగతాగటం అలవాటు లేని ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగుల్లో 65శాతం మంది మహిళలు, 35 శాతం మంది పురుషులు ఉన్నారు.

ఈ జాగ్రత్తలు పాటించండి....

ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే తొలుత పొగ తాగకూడదు. తాగే వారి పక్కన కూడా ఉండకూడదు. ప్రతిరోజూ కొద్దిపాటి వ్యాయామాలు చేయాలి. వారానికి ఐదు యాపిల్ పండ్లు తింటే ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. బీటా కెరోటిన్ పోషకాహారం తీసుకోవటం ద్వారా లంగ్ క్యాన్సర్ బారిన పడే ముప్పును తప్పించుకోవచ్చు.

వ్యాధి లక్షణాలు...

విడవకుండా దగ్గు రావటం, దగ్గులో రక్తం పడటం, ఆకలి లేకపోవటం, ఛాతీలో నొప్పి, గొంతు బొంగురు పోవటం, ఎలాంటి ప్రయత్నాలు చేయకుండానే బరువు తగ్గిపోవటం, ఎముకలు, కీళ్లు, వెన్ను, నడుంనొప్పి ఎక్కువ కాలం ఉండటం, శ్వాస సరిగా ఆడకపోవటం, శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడటం, నిద్రలో గురకరావటం, తరచుగా జబ్బు బారిన పడటం లాంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం అలస్యం చేయకుండా ఊపిరితిత్తుల క్యాన్సర్‌గా భావించి వైద్యులను సంప్రదించాలి.

ఆధునిక వైద్యం అందుబాటులో....



క్యాన్సర్‌లను గుర్తించేందుకు నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. కుటుంబంలో ఒకరికి లంగ్ క్యాన్సర్ ఉంటే ఇతర కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ముందస్తు వైద్యపరీక్షలు చేయించుకోవడం చాలా ఉత్తమం. గతంలో క్యాన్సర్లు 50 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సులో ఉన్నవారిలో వచ్చేవి. నేడు 30 ఏళ్లకే క్యాన్సర్లు రావడం చాలా బాధాకరం.

– డాక్టర్ ఎస్.జి.నాగకిషోర్, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

సకాలంలో వ్యాధి నిర్ధారణ చేయించుకోవాలి....



పలువురు వ్యాధి నిర్ధారణ సకాలంలో చేయించుకోవడం లేదు. దీంతో వ్యాధి నిర్ధారణ చేసే సమయానికి క్యాన్సర్ మూడో దశలో ఉన్నట్లు గుర్తిస్తున్నాం. దీని వల్ల వైద్యం చేసినా ఎలాంటి ప్రయోజనం ఉండదు. వాతావరణ కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతున్న దృష్ట్యా 40 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ చక్కా సుజాత, రేడియాలజిస్ట్, గుంటూరు

బంగారం గొలుసు చోరీ

కృష్ణలంక(విజయవాడ తూర్పు): నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలోని బంగారం గొలుసు గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని వెళ్లిన ఘటనపై కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరుకు చెందిన గుంటుపల్లి వాణిశ్రీ బుధవారం ఉదయం కృష్ణలంకలోని ఐడియల్ పబ్లిక్ స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్లింది. సాయంత్రం 3.30 గంటల సమయంలో ఆమె షాపునకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఆ సమయంలో సుమారు 20 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని యువకుడు స్కూటర్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న 50 గ్రాముల బంగారం చైన్‌ను లాక్కొని వెళ్లిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సస్పెన్షన్‌కు గురైన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గతం 11 నెలల కాలం నుంచి సస్పెన్షన్‌కు గురైన 12 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం విధుల్లోకి చేరిన నగర కమిషనర్ హరికృష్ణను మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శివారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రెహమాన్, నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, లక్ష్మీ నారాయణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుమిత్రా దేవి, సహాధ్యక్షురాలు లీలాబాయి, రోజారాణి, నీలిమ పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: తల్లిపాలు బిడ్డకు సంపూర్ణమైన పోషకాహారమని, బిడ్డ పుట్టిన గంటలోపలే తల్లిపాలు పట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం సెమినార్ హాలులో ఆస్టర్ రమేష్ మల్టిస్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాలపై ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కాన్పు సమయంలో ఉత్పత్తి అయ్యే కొలెస్ట్రమ్ వలన వ్యాధినిరోధక శక్తి వస్తుందన్నారు. తల్లిపాల వల్ల బిడ్డకు తేలికగా జీర్ణం అవడం, వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆస్టర్ రమేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన గైనకాలజిస్ట్ ఎస్.అనిత, డాక్టర్ సాహితీ, డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మమత పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి ఎస్పీ సత్కారం

నగరంపాలెం: ఉద్యోగ విరమణ అనంతరం ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఆనందంగా జీవించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆకాంక్షించారు. ఎస్బీ డీఎస్పీ టి.రత్నస్వామి, ఏఎస్ఐలు వెంకటేశ్వర్లు (ఎస్‌బీ), టి.పెదబాబు (కంట్రోల్ రూమ్), షేక్ ఎండీ జానీ (మేడికొండూరు పీఎస్), కె.మోహనరావు (ఫిరంగిపురం పీఎస్), హెడ్ కానిస్టేబుల్ దేవరాజు (అరండల్‌పేట పీఎస్), హెచ్‌సీ రత్నరాజు (ఏఆర్), కానిస్టేబుల్ కమల్ బాషా (తుళ్లూరు ట్రాఫిక్ పీఎస్)లు బుధవారం ఉద్యోగ విరమణ పొందగా, జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ క్రమ శిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారని కొనియాడారు. చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వహించారని, అందరూ ఒకే పోలీస్ కుటుంబమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, జిల్లా ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, ఆర్ఐ హరిరెడ్డి, గుంటూరు జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు కరుణాకర్, కరిముల్లా, లక్ష్మణ్ , మైలా సాంబశివరావు పాల్గొన్నారు.